TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 68 | పేజీలు : 04| వెల: రూ.3/-  తెలంగాణ  శనివారం | జూన్ 20, 2026

## బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

- శ్రీరాముడి చిత్రపటం అవమానంపై హిందువుల ఆగ్రహం
- రాజధాని ఢాకాలో భారీ నిరసన ర్యాలీ
- నిందితులను 72 గంటల్లో అరెస్ట్ చేయాలి
- హిందూ సంఘాల అల్టిమేటమ్


2లో..

**ఢాకా, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** బంగ్లాదేశ్‌లో మైనారిటీలుగా ఉన్న హిందువులపై, వారి మత విశ్వాసాలపై జరుగుతున్న దాడులు, అవమానకర చర్యలతో అక్కడ మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగాయి. హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీరాముడి చిత్రపటంపై చెప్పు ఉంచి ఘోరంగా అవమానించారనే వార్తలతో రాజధాని ఢాకా నగరం అట్టుడికిపోయింది. ఈ హేయమైన చర్యకు నిరసనగా శుక్రవారం రాత్రి వేలాది మంది హిందువులు కాగడాలు, కొవ్వొత్తులతో రోడ్లపైకి వచ్చి భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. 'జై శ్రీరామ్' అంటూ చేసిన నినాదాలతో ఢాకా వీధులు మారుమోగాయి.



### ఒడిశాలో రూ. 47,000 కోట్లతో
## వికాస విప్లవం..
2లో..

- శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ, రాష్ట్రపతి ముర్ము
- మయూర్‌భంజ్‌లో 'వికాస్ రా ధారా' సభ
- రాష్ట్రపతి జన్మదినోత్సవం రోజే స్వగ్రామం పహాడ్‌పూర్‌కు సరికొత్త గుర్తింపు..
- 'సోలార్ విలేజ్'గా ప్రకటన

**భువనేశ్వర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఒడిశా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ రాష్ట్రంలో భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మయూర్‌భంజ్ జిల్లా రైరంగ్‌పూర్‌లో శనివారం నిర్వహించిన 'వికాస్ రా ధారా, ఒడిశా సారా' బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం దాదాపు రూ. 47,000 కోట్ల విలువైన పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు రాష్ట్రపతి, ప్రధాని సంయుక్తంగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ బృహత్తర కార్యక్రమం జరగడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పుట్టినరోజును పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను సందర్శించి శుభాకాంక్షలు తెలిపారు.


## వీబీజీ రామ్‌జీ చట్టాన్ని సవరించాల్సిందే..

- కేంద్రానికి మూడు లేఖలు రాశాం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- ప్రస్తుత విధానంతో గ్రామ పంచాయతీలు పూర్తిగా బలహీనం
- ఉపాధి హామీలో 60 రోజుల తప్పనిసరి విరామం నిబంధనను ఎత్తివేయాలి
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వీబీజీ రామ్‌జీ పరిధిలోకి తీసుకురావాలి


3లో..

## కన్నతల్లి ఘాతుకం

- ప్రియుడి మోజులో రెండేళ్ల కొడుకు దారుణ హత్య!
- ఫిట్స్‌తో చనిపోయాడని భర్తను నమ్మించిన నిందితురాలు
- ఇంట్లో రక్తపు మరకలు, భార్య ప్రవర్తనతో భర్తకు అనుమానం..
- 20 రోజుల తర్వాత వెలుగులోకి..
- కన్నతల్లి జ్యోతి అరెస్ట్..
- పరారీలో ఉన్న ప్రియుడు నవీన్ కోసం పోలీసుల గాలింపు


2లో..

## ఓటర్ల 'సర్వే' ప్రక్రియపై అప్రమత్తం కావాలి..


2లో..

- లేదంటే తీవ్ర నష్టం: మంత్రి తుమ్మల
- ఖమ్మం నియోజకవర్గంలో లక్షన్నరకు పైగా ఓట్లు తొలగిపోయే ప్రమాదం ఉంది
- ఓట్లను కాపాడుకోలేకపోతే భవిష్యత్తు రాజకీయం శూన్యం..
- కార్యకర్తలకు హితవు
- అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి ఓటునూ రక్షించుకోవాలి

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
శనివారం, జూన్ 20, 2026

# బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

- శ్రీరాముడి చిత్రపటం అవమానంపై హిందువుల ఆగ్రహం
- రాజధాని ఢాకాలో భారీ నిరసన ర్యాలీ
- నిందితులను 72 గంటల్లో అరెస్ట్ చేయాలి
- హిందూ సంఘాల అల్టిమేటమ్

**ఢాకా, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** బంగ్లాదేశ్‌లో మైనారిటీలుగా ఉన్న హిందువులపై, వారి మత విశ్వాసాలపై జరుగుతున్న దాడులు, అవమానకర చర్యలతో అక్కడ మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగాయి. హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీరాముడి చిత్రపటంపై చెప్పు ఉంచి ఘోరంగా అవమానించారనే వార్తలతో రాజధాని ఢాకా నగరం అట్టుడికిపోయింది. ఈ హేయమైన చర్యకు నిరసనగా శుక్రవారం రాత్రి వేలాది మంది హిందువులు కాగడాలు, కొవ్వొత్తులతో రోడ్లపైకి వచ్చి భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఉత్తర గాయిబంద జిల్లాలో స్థానిక శ్రీశ్రీ రాధాగోవింద దేవాలయ కమిటీ 81 అడుగుల ఎత్తైన శ్రీరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంది. అయితే, అక్కడి స్థానిక మత అతివాదుల నుంచి తీవ్ర స్థాయిలో బెదిరింపులు రావడంతో ఆ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా పడింది. ఈ వివాదం నడుస్తుండగానే, కొందరు ఆకతాయిలు ఉద్దేశపూర్వకంగా శ్రీరాముడి చిత్రపటాన్ని అవమానించేలా దౌర్జన్యానికి దిగడంతో హిందూ సమాజం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హిందూ మహాజ్యోత్ సంస్థ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం రాత్రి ఢాకాలోని షహబాగ్ కూడలికి సామాన్య ప్రజలు, మహిళలు, యువకులు వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. షహబాగ్ కూడలి నుండి నేషనల్ ప్రెస్ క్లబ్ వరకు కిలోమీటర్ల మేర నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రెస్ క్లబ్ ప్రధాన రహదారిపై వేలాది మందితో భారీ మానవహారంగా ఏర్పడి నిరసన గళం విప్పారు. రంగపూర్ ప్రాంతంలో నిరసన తెలుపుతున్న హిందువులను పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో అక్కడ పోలీసులకు, ప్రదర్శనకారులకు మధ్య తీవ్ర నెట్టులాట జరిగి ఉద్రిక్తత మరింత పెరిగింది. తమ మత విశ్వాసాలను దెబ్బతీసి, సమాజంలో అలజడి సృష్టించిన నిందితులను 72 గంటల్లోగా గుర్తించి అరెస్టు చేయాలని హెచ్చరించారు. గడువులోగా చర్యలు తీసుకోకపోతే దేశవ్యాప్తంగా నిరసనలను మరింత తీవ్రం చేస్తామని హిందూ సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు.

# ఒడిశాలో రూ. 47,000 కోట్లతో వికాస విప్లవం

- శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ, రాష్ట్రపతి ముర్ము
- మయూర్‌భంజ్‌లో 'వికాస్ రా ధారా' సభ
- రాష్ట్రపతి జన్మదినోత్సవం రోజే స్వగ్రామం పహాడ్‌పూర్‌కు సరికొత్త గుర్తింపు..
- 'సోలార్ విలేజ్'గా ప్రకటన



(మొదటి పేజీ తర్వాత..) ఈ సందర్భంగా ఆ గ్రామాన్ని అత్యంత వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తామని ప్రధాని సంచలన ప్రకటన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా పహాడ్‌పూర్ గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుందని, మిగులు విద్యుత్‌ను విక్రయించుకోవడం ద్వారా గ్రామస్థులకు అదనపు ఆదాయం సమకూరుతుందని ప్రధాని వివరించారు. ఒడిశాలోని ప్రపంచ ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధనకేంద్రంగా సరికొత్త మైలురాయిని అధిగమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒడిశాలోని అపారమైన సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడమే డబుల్ ఇంజిన్ సర్కార్ లక్ష్యమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో 'ఉత్కర్ష్ ఒడిశా' ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు రేకెత్తుతాయన్నారు.



గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రారంభించామని మోదీ పునరుద్ఘాటించారు. బహిరంగ సభకు ముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని 'సంతాలీ జాహిరా', 'హో జాహిరా' అనే పవిత్ర వనాలను సందర్శించారు. అక్కడ గిరిజన సాంప్రదాయ పద్ధతుల్లో ప్రత్యేక పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు, ప్రగతి కోసం ప్రార్థనలు చేశారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని ప్రధాని గుర్తుచేశారు. గత వారమే 'రాజా పర్బ' పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారని, ప్రస్తుతం జగన్నాథ రథయాత్ర, బరిపడ రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సాంస్కృతిక ఉత్సవాల మధ్య ఒడిశాలో 'ప్రజాస్వామ్యం, అభివృద్ధి' అనే సరికొత్త పండుగ కూడా సమాంతరంగా నడుస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు.

# కన్నతల్లి ఘాతుకం

- ప్రియుడి మోజులో రెండేళ్ల కొడుకు దారుణ హత్య
- ఫిట్స్‌తో చనిపోయాడని భర్తను నమ్మించిన నిందితురాలు
- ఇంట్లో రక్తపు మరకలు, భార్య ప్రవర్తనతో భర్తకు అనుమానం..
- 20 రోజుల తర్వాత వెలుగులోకి..
- కన్నతల్లి జ్యోతి అరెస్ట్..
- పరారీలో ఉన్న ప్రియుడు నవీన్ కోసం పోలీసుల గాలింపు

**జగదేవ్‌పూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రియుడితో అక్రమ సంబంధానికి అడ్డొస్తున్నాడని కన్నకొడుకును ఓ తల్లి అత్యంత క్రూరంగా అంతమొందించిన దారుణ ఘటన సిద్దిపేట జిల్లాలో వెలుగుచూసింది. బాబు అకస్మాత్తుగా 'ఫిట్స్' వచ్చి చనిపోయాడని నాటకమాడి భర్తను, బంధువులను నమ్మించినప్పటికీ.. భర్తకు వచ్చిన అనుమానంతో 20 రోజుల తర్వాత ఈ పాశవిక బండారం బయటపడింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన స్వామి క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన భార్య జ్యోతి, రెండేళ్ల కుమారుడు హరికృష్ణతో కలిసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్నారు. ఈ క్రమంలో జ్యోతికి నవీన్ అనే వ్యక్తితో అక్రమ సంబంధం ఏర్పడింది. భర్త డ్యూటీకి వెళ్లిన సమయంలో జ్యోతి ప్రియుడిని ఇంటికి పిలిపించుకునేది. వీరిద్దరూ ఏకాంతంగా ఉన్న సమయంలో రెండేళ్ల బాబు హరికృష్ణ తరచూ ఏడుస్తుండటంతో ప్రియుడు నవీన్ తీవ్ర చిరాకు పడ్డాడు. "నీ కొడుకు నాకు నచ్చడం లేదు.. వాడిని చంపేద్దాం" అని జ్యోతితో అనగా, మాతృత్వాన్ని మరిచిన ఆమె కూడా అందుకు పచ్చజెండా ఊపింది. ఈ క్రమంలోనే ఏడుస్తున్న పసికందును ఇద్దరూ కలిసి అత్యంత దారుణంగా నేలకేసి కొట్టి అక్కడికక్కడే హతమార్చారు. బాబు చనిపోయిన తర్వాత నిందితురాలు జ్యోతి ఏమీ తెలియనట్లు పెద్ద నాటకమాడింది. భర్త స్వామి ఇంటికి రాగానే.. బాబుకు అకస్మాత్తుగా తీవ్రమైన ఫిట్స్ (ఫిట్సలు) వచ్చాయని, ఆసుపత్రికి తీసుకెళ్లే లోపే చనిపోయాడని నమ్మబలికి కన్నీరుమున్నీరైంది. భార్య మాటలను నిజమని నమ్మిన స్వామి.. తీవ్ర ఆవేదనతో అదే రోజు రాత్రి కుమారుడి మృతదేహాన్ని తన స్వగ్రామమైన తీగుల్‌కు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించి ఖననం చేశాడు.బాబు చనిపోయిన కొద్దిరోజుల తర్వాత భార్య జ్యోతి ప్రవర్తనలో తీవ్రమైన మార్పులు రావడం, ఆమె నిరంతరం ఫోన్లలో మాట్లాడుతుండటాన్ని గమనించిన స్వామికి అనుమానం మొదలైంది. దీనికి తోడు ఇంట్లోని ఒక మూల అస్పష్టంగా ఉన్న రక్తపు మరకలు కనిపించడంతో అతని అనుమానం మరింత బలపడింది. దీంతో తన కుమారుడి మృతిపై పూర్తి విచారణ జరపాలని స్వామి పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కీసర పోలీసులు కేసు నమోదు చేసుకుని జ్యోతిని తమదైన శైలిలో విచారించగా, ప్రియుడు నవీన్‌తో కలిసి తానే కొడుకును నేలకేసి కొట్టి చంపినట్లు అంగీకరించింది. దీంతో పోలీసులు తీగుల్ గ్రామంలో ఖననం చేసిన బాలుడి మృతదేహాన్ని రెవెన్యూ అధికారుల సమక్షంలో వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. హత్యకు పాల్పడిన కన్నతల్లి జ్యోతిని పోలీసులు అరెస్ట్ చేయగా, ప్రస్తుతం పరారీలో ఉన్న ప్రియుడు నవీన్ కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది.

# ఓటర్ల 'సర్వే' ప్రక్రియపై అప్రమత్తం కావాలి..

- లేదంటే తీవ్ర నష్టం: మంత్రి తుమ్మల
- ఖమ్మం నియోజకవర్గంలో లక్షన్నరకు పైగా ఓట్లు తొలగిపోయే ప్రమాదం ఉంది
- ఓట్లను కాపాడుకోలేకపోతే భవిష్యత్తు రాజకీయం శూన్యం..
- కార్యకర్తలకు హితవు
- అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి ఓటునూ రక్షించుకోవాలి

**ఖమ్మం, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** "ప్రస్తుతం సాగుతున్న ఓటర్ల సర్వే ప్రక్రియపై నాయకులు, కార్యకర్తలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఇందులో నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో అనేక రకాల రాజకీయ సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది" అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. శనివారం ఖమ్మం నగరంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలతో మంత్రి తుమ్మల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓట్ల తొలగింపు, మ్యాపింగ్ ప్రక్రియలో జరుగుతున్న పరిణామాలపై ఆయన శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గణాంకాలతో సహా క్షేత్రస్థాయి పరిస్థితిని వివరించారు. ఖమ్మం నియోజకవర్గంలో మొత్తం 3,02,800 ఓట్లు ఉండగా, అందులో కనీసం సగం ఓట్లు కూడా ఇప్పటివరకు మ్యాపింగ్ కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 55 శాతానికి పైగా, అంటే లక్షన్నరకు పైగా ఓట్లు జాబితా నుండి తొలగిపోయే ప్రమాదకర పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోందని మండిపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం మూడు శాతం ఓట్ల తేడాతోనే మనం విజయం సాధించామనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఇప్పుడు గనక మనం అప్రమత్తంగా లేకపోతే తీవ్రంగా నష్టపోతాం. రాజకీయాల్లో కొనసాగాలని అనుకునే ప్రతి ఒక్కరికీ ఓట్లను కాపాడుకోవడం అనేది ఇప్పుడు జీవన్మరణ సమస్యగా మారింది. ప్రతి ఒక్క ఓటునూ కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది అని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఓటర్ల జాబితా సవరణ, సర్వేల సమయంలో అలసత్వం వహిస్తే ఎలాంటి పరిణామాలు ఉంటాయో వివరించేందుకు మంత్రి దేశంలోని ప్రముఖ నేతల ఉదాహరణలను ప్రస్తావించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తమిళనాడు సీఎం స్టాలిన్ గతంలో కొన్ని చోట్ల ఓడిపోవడానికి దారితీసిన పరిస్థితులను, ఓట్ల మేనేజ్‌మెంట్ లో లోపాలను స్థానిక నాయకులు గుర్తుచేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీజేపీ కావాలనే కొన్ని ఓట్లను తొలగిస్తోందని, మరో పార్టీ ఇంకోలా చేస్తోందని క్షేత్రస్థాయిలో రకరకాల ప్రచారాలు, వదంతులు వస్తున్నాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రాజకీయ విమర్శలకు పోకుండా, క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్న అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి లీడర్లు అధికారులతో కలిసి సమన్వయం చేసుకుంటూ, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటును జాబితాలో భద్రపరిచేలా చొరవ చూపాలని తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

# వీబీజీ రామ్‌జీ చట్టాన్ని సవరించాల్సిందే..

- కేంద్రానికి మూడు లేఖలు రాశాం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- ప్రస్తుత విధానంతో గ్రామ పంచాయతీలు పూర్తిగా బలహీనం
- ఉపాధి హామీలో 60 రోజుల తప్పనిసరి విరామం నిబంధనను ఎత్తివేయాలి
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వీబీజీ రామ్‌జీ పరిధిలోకి తీసుకురావాలి



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన వీబీజీ రామ్‌జీ చట్టం గ్రామీణ ప్రాంతాలను, ముఖ్యంగా సామాన్య పేదలను ఇబ్బందుల పాలు చేసే విధంగా ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నూతన చట్టాన్ని వ్యతిరేకిస్తూ, అందులోని ప్రజా వ్యతిరేక నిబంధనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి మూడు వేర్వేరు నిరసన లేఖలు పంపినట్లు ఆమె వెల్లడించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా కొనసాగించి గ్రామీణ పేదల ఉపాధి హక్కును కేంద్రం కాపాడాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. కొత్త చట్టంలోని నిధుల కేటాయింపు విధానం పేదలు, దళితులు, గిరిజనులకు తీవ్ర అన్యాయం చేసేలా ఉందన్నారు. రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా చూడకుండా, క్షేత్రస్థాయిలో గ్రామ పంచాయతీల్లో నమోదైన వాస్తవ పనిదినాల ఆధారంగానే నిధుల కేటాయింపు జరగాలని, ఈ విషయంలో కేంద్రం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని స్పష్టం చేశారు. ఉపాధి విరామం మినహాయింపు: చట్టంలో పేర్కొన్న 60 రోజుల తప్పనిసరి ఉపాధి విరామం గ్రామీణ పేదల ఆదాయాన్ని దెబ్బతీస్తుంది. కాబట్టి ఆదివాసీ గిరిజన ప్రాంతాలు, నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు ఈ 60 రోజుల నిషేధం నుండి మినహాయింపు ఇవ్వాలి. వ్యవసాయ అనుబంధ పనులకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించాలి. మొక్కల పెంపకం, అటవీకరణ కార్యక్రమాలకు ఈ ఉపాధి విరామ నిబంధనను వర్తింపజేయకూడదు. ఇందిరమ్మ ఇళ్లకు అనుసంధానం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వీబీజీ రామ్‌జీ పరిధిలో అనుమతించాలి. గృహ నిర్మాణ లబ్ధిదారులకు గతంలో లాగే 90 రోజుల ఉపాధి కూలి కల్పించాలి. వ్యక్తిగత భూ అభివృద్ధి పనులను చట్టం నుండి తొలగిస్తే చిన్న, సన్నకారు రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. వరదలతో దెబ్బతిన్న భూముల పునరుద్ధరణ, న్యూట్రి గార్డెన్లు, వెదురు తోటల పెంపకానికి అనుమతులు కొనసాగించాలి. “కొత్త నిబంధనల వల్ల గ్రామ పంచాయతీల అధికారాలు పూర్తిగా బలహీనపడుతున్నాయి. ములుగు, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ వంటి ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల ప్రత్యేక అవసరాలను కేంద్రం విస్మరించకూడదు. దళితులు, గిరిజనులు, భూమి లేని కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం తక్షణమే ఈ చట్టాన్ని సవరించాలి.” అని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క డిమాండ్ చేశారు.

# డిండి కట్ట మైసమ్మ దేవస్థానం హుండీ లెక్కింపు



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం లతీపూర్ గ్రామంలోని శ్రీ కట్ట మైసమ్మ దేవస్థానంలో శనివారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ నాగర్ కర్నూల్ జిల్లా పరిశీలకులు టి. మదన్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈకార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి ఆర్. శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్ ఎడ్ల నరేష్, ధర్మకర్తల సభ్యులు వెంకటేష్, నిరంజన్, రవి, లక్ష్మి, ఆలయ పూజారులు దేవర్ల సాయిల్, దేవర్ల వెంకటేష్, మల్లయ్య, ఉప్పునుంతల తహసీల్దార్ సునీత, ఎస్సై మహేష్ గౌడ్, పోలీసు సిబ్బంది, అచ్చంపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది రేణయ్య, భాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.హుండీ లెక్కింపులో నోట్ల రూపంలో రూ.51,930, చిల్లర రూపంలో రూ. 16,466 లభించగా, మొత్తం ఆదాయం రూ.68,396 వచ్చినట్లు అధికారులు తెలిపారు. హుండీ ఆదాయాన్ని అచ్చంపేటలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో ఆలయ ఎస్బీఐ ఖాతాలో జమ చేసినట్లు వెల్లడించారు.

# ఘనంగా ‘జయశంకర్ సార్’ వర్ధంతి వేడుకలు

- ఆయన భావజాల స్ఫూర్తి, త్యాగాలు చిరస్మరణీయం
- హెచ్‌ఎం విక్కుర్తి లక్ష్మీనారాయణ



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తన జీవితాంతం పరితపించిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ అని వేములవాడ న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ కొనియాడారు. తెలంగాణ ఉద్యమ పితామహుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ 15వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. జయశంకర్ సార్ భావజాల వ్యాప్తి, పట్టుదల, త్యాగాలు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో కీలకపాత్ర పోషించాయని గుర్తుచేశారు. 1934 ఆగస్టు 6న హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేటలో జన్మించిన జయశంకర్ సార్, 1952 నాటి ముల్కీ ఉద్యమం నుండి మొదలుకొని, 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు ప్రతి దశలోనూ ప్రత్యేక రాష్ట్రం కోసం తన గళాన్ని వినిపించారని స్పష్టం చేశారు. నాటి ఉమ్మడి పాలనలో తెలంగాణ ప్రాంతానికి నీటిపారుదల, నిధులు, నియామకాల్లో జరుగుతున్న అన్యాయాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి ప్రజలకు అర్థమయ్యేలా వివరించిన మేధావి సార్ అని శ్లాఘించారు. చిన్న రాష్ట్రాల వల్లనే పరిపాలన సులువై, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, రాజకీయ సమానత్వం మరియు ప్రాంతీయ అభివృద్ధి సాధ్యమని సార్ బలంగా నమ్మారని తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ గా పనిచేసిన కాలంలో విద్యావేత్తగా ఎంతోమంది విద్యార్థులను తెలంగాణ భావజాల స్ఫూర్తితో తీర్చిదిద్దారని పేర్కొన్నారు. 2011 జూన్ 21న తుదిశ్వాస విడిచిన జయశంకర్ సార్, తెలంగాణ ప్రజల హృదయాలలో “తెలంగాణ జాతిపిత”గా ఎప్పటికీ చిరస్మరణీయులుగా నిలిచిపోతారని లక్ష్మీనారాయణ వివరించారు. రాబోయే తరాలకు ఆయన ఆశయాలను, తెలంగాణ కోసం ఆయన చేసిన పోరాటాలను వివరించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ స్మరణ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని సార్‌కు నివాళులు అర్పించారు.

# నాగర్‌కర్నూల్ జిల్లాను పచ్చని పసిడి గంపగా మారుస్తాం

- మంత్రి జూపల్లి కృష్ణారావు



**అచ్చంపేట,వాయిస్ ఆఫ్ వందే భారత్ :** “నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని పెండింగ్ నీటిపారుదల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రతి ఎకరానికి సాగునీరు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది” అని రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, కాల్వల పనులు మరియు ఆయకట్టు స్థిరీకరణపై శనివారం ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో కలిసి మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా. జిల్లెల్ల చిన్నారెడ్డి, పార్లమెంట్ సభ్యులు డా. మల్లు రవి, జిల్లా శాసనసభ్యులు సంయుక్తంగా ఒక సుదీర్ఘ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి, సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల జిల్లాలో నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టుల పనులను యుద్ధప్రాతిపదికన ముందుకు తీసుకెళ్తామన్నారు. ఇందుకోసం బడ్జెట్‌లో నిధుల కొరత లేకుండా చూస్తామని, ఎక్కడా పనులు ఆగిపోకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తామని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో ఎంపీ మల్లు రవి, జిల్లా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ జిల్లాను పచ్చని పసిడి గంపగా మార్చడమే తమ సంకల్పమన్నారు. వృథాగా పోతున్న కృష్ణా జలాలను ఒడిసిపట్టి, జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో చివరి ఆయకట్టు రైతుకు కూడా సాగునీరు అందేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. జిల్లా ప్రగతి కోసం, ప్రాజెక్టుల సాధన కోసం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలమంతా ఏకతాటిపైకి వచ్చి, కలిసికట్టుగా నిధులు సాధించి పనులను పూర్తి చేయిస్తామని రైతాంగానికి భరోసా ఇచ్చారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ , సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఈఈలు, జిల్లా స్థాయి ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

# ఎదురుగట్ల గ్రామంలో అన్నదానం



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం ఎదురు గట్ల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో వేములవాడ పట్టణం చెందిన ప్రముఖ విద్యా సంస్థ గౌతమ్ మోడల్ స్కూల్స్ కరస్పాండెంట్ బూర ఉమా రమేష్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తి భావం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. గ్రామస్తులు సుభిక్షంగా ఉండాలని సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆమె పేర్కొన్నారు. తమ పిలుపును అందుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గ్రామస్తులకు, భక్తులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో గౌతమ్ మోడల్ స్కూల్ సిబ్బంది ఆలయ అర్చకులు, ఎదురుగట్ల గ్రామ ప్రజలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
శనివారం, జూన్ 20, 2026

# సిరిసిల్లలో భారీ 'ధాన్యం' కుంభకోణం

- ఆరుగురు నిందితుల అరెస్ట్
- నకిలీ ట్రక్ చిట్టీలతో రూ.91 లక్షల ప్రభుత్వ సొమ్ము స్వాహా
- గోదాం చేరకుండానే 10 లారీల వడ్లు గుట్టుచప్పుడు కాకుండా మాయం
- రూ. 14.16 లక్షల నగదు స్వాధీనం..
- రూ. 46.21 లక్షల బ్యాంక్ నిధులు ఫ్రీజ్



**రాజన్న సిరిసిల్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రభుత్వ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నకిలీ ట్రక్ చిట్టీలను సృష్టించి సుమారు రూ.91 లక్షల ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన అంతర్-జిల్లా కేటుగాళ్ల ముఠాను సిరిసిల్ల పట్టణ పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. ఈ కుంభకోణానికి పాల్పడిన ఐకేపీ, పీఏసీఎస్ మరియు గోదాం సిబ్బందితో కూడిన ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. జిల్లా ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దూర్ అపారెల్ పార్క్ గోదాం మేనేజర్ ఉత్కం విజయ్, సూపర్‌వైజర్ వాసాల గణేష్ ఈ కుంభకోణంలో ప్రధాన సూత్రధారులుగా మారారు. వీరు రుద్రంగి ఐకేపీ కేంద్రం ఇన్-చార్జ్ గడ్డం స్వామితో కలిసి రెండు లారీలకు, అలాగే బద్దెనపల్లి పీఏసీఎస్ కేంద్రం ఇన్-చార్జ్ గాజుల నవీన్, డీఎంవో కార్యాలయ కో-ఆర్డినేటర్ కమ్మరి రాజశేఖర్‌లతో కలిసి మరో లారీ ధాన్యానికి నకిలీ ట్రక్ చీటీలు సృష్టించారు. ఆ ధాన్యం గోదాంకు వచ్చినట్లు సివిల్ సప్లై వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి, ప్రభుత్వం నుండి విడుదలైన నిధులను నిందితులు తమలో తాము పంచుకున్నారు. మరో పెద్ద మోసంలో భాగంగా.. వివిధ ఐకేపీ కేంద్రాల నుండి అపారెల్ పార్క్ గోదాంకు వచ్చిన 10 లారీల ధాన్యానికి సంబంధించిన నిల్వలను అసలు గోదాంలో దించకుండానే, ఆన్‌లైన్‌లో మాత్రం దించినట్లు తప్పుడు రికార్డులు నమోదు చేశారు. అనంతరం ఆ ధాన్యాన్ని నేరుగా వేములవాడకు చెందిన రైస్ మిల్ ఓనర్ చేపురి మధుకర్‌కు అప్పగించారు. మధుకర్ ఆ ధాన్యమును సిద్దిపేటకు చెందిన కమిషన్ ఏజెంట్ చిటుకుల శ్రీకాంత్ ద్వారా వివిధ రైస్ మిల్లులకు విక్రయించి భారీగా సొమ్ము చేసుకున్నారు. జిల్లా సివిల్ సప్లై మేనేజర్ ఎస్.నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి నిందితులను పట్టుకున్నారు. పోలీసులు ఈ కేసులో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు,యు ఫ్రీజ్ చేసిన బ్యాంక్ నిధుల వివరాలు ఉత్కం విజయ్ (ఏ1) మేనేజర్, పెద్దూర్ అపారెల్ పార్క్ గోదాం రూ. 2,85,40 రూ. 37,65,358, కమ్మరి రాజశేఖర్ (ఏ2) మండల స్థాయి కో-ఆర్డినేటర్, డీఎంఓ ఆఫీస్ రూ. 1,50,000, గడ్డం స్వామి (ఏ3) ఇన్-చార్జ్, రుద్రంగి ఐకేపీ కేంద్రంలో చేపురి మధుకర్ (ఏ4) ఓనర్, మల్లికార్జున రైస్ మిల్, వేములవాడ రూ. 9,81,400, రూ. 4,68,555, వాసాల గణేష్ (ఏ5) సూపర్‌వైజర్, ఎస్ డబ్ల్యూ సీ గోదాం, పెద్దూర్ రూ . 8,67,711గాజుల నవీన్ (ఏ6) ఇన్-చార్జ్, బద్దెనపల్లి పీఏసీఎస్ విచారణలో ఉంది. "అన్నదాతల ధాన్యం నిధులను కన్నం వేసి, నకిలీ పత్రాలతో ప్రభుత్వ ఖజానాను దోచుకోవాలని చూస్తే ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదు. ప్రస్తుతం నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాం. ఈ భారీ కుంభకోణంపై మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోంది, దీని వెనుక మరికొందరి పాత్రపై కూడా నిఘా పెట్టాం." అని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే తెలిపారు.

# సీపీఎం మహాసభల్లో ప్రభుత్వ ఉపాధ్యాయుడు

- నియోజకవర్గంలో తీవ్ర చర్చాంశం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు బహిరంగంగా రాజకీయ పార్టీ అనుబంధ సంఘం సభలకు హాజరుకావడం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో తీవ్ర కలకలం రేపింది. సిపిఎం పార్టీ అనుబంధ సంస్థ అయిన 'తెలంగాణ ప్రాంత వ్యవసాయ కార్మిక సంఘం' రాష్ట్ర మహాసభలు శనివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ప్రారంభమయ్యాయి. ఈ మహాసభలకు అచ్చంపేట ప్రాంతం నుండి బయలుదేరిన ప్రతినిధుల బృందంలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు నేరుగా పాల్గొనడం, వారితో కలిసి ప్రయాణించడం క్షేత్రస్థాయిలో చర్చనీయాంశంగా మారింది. రాజకీయ కార్యక్రమాలకు హాజరైన సదరు ఉపాధ్యాయుడు ప్రస్తుతం ఉప్పునుంతల మండలం రాయిచేడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ సర్వీస్ రూల్స్ ప్రకారం ఉద్యోగంలో ఉన్న ఏ అధికారి లేదా ఉపాధ్యాయుడు ప్రత్యక్షంగా రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో కానీ, వారి అనుబంధ సంఘాల సభల్లో కానీ పాల్గొనకూడదు. అయినప్పటికీ బాధ్యతాయుతమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఇలా పార్టీ మీటింగులకు వెళ్లడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయుడు నిబంధనలను ఉల్లంఘించి రాజకీయ సభల ప్రతినిధిగా హాజరవ్వడంపై నియోజకవర్గంలోని వివిధ ప్రజా, నిరుద్యోగ సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి చర్యలు విద్యార్థులకు, సమాజానికి తప్పుడు సంకేతాలు పంపుతాయని మండిపడుతున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారులు, ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించి, విచారణ జరిపి సదరు ఉపాధ్యాయుడిపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

# ప్రజా పాలన – ప్రగతి నివేదిక బస్సు యాత్ర

## పాల్గొన్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రజా పాలన – ప్రగతి నివేదిక రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ ప్రజా పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బస్సు యాత్ర నిర్వహించబడింది.. ఈ సందర్భంగా అచ్చంపేట నియోజకవర్గంలోని లింగాల, బాల్మూర్ మండలాలు మరియు అచ్చంపేట, అమ్రాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన "ప్రజా పాలన – ప్రగతి నివేదిక" కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూగత రెండున్నర సంవత్సరాలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని అనేక సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు ప్రతి పేద కుటుంబానికి చేరేలా కృషి జరుగుతోందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కల్పించడం, అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ ఫలాలు పొందేలా చేయడమే ఈ "ప్రజా పాలన – ప్రగతి నివేదిక" కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకొస్తున్నాయని, అభివృద్ధి ఫలాలు గ్రామీణ ప్రాంతాలకు సైతం చేరుతున్నాయని తెలిపారు.

# కాంగ్రెస్ పాలన అంటేనే రాక్షస పాలన..

- రైతులపై రేవంత్ సర్కార్ కక్షపూరితం
- హామీల అమలులో కాంగ్రెస్ వైఫల్యం
- యూరియా కోసం 'యాప్' ఏంది?..
- చెప్పులు క్యూలో పెట్టే దౌర్భాగ్యం తెచ్చారు!
- బీఆర్ఎస్ నియోజకవర్గ ముఖ్య నేతల ప్రెస్ మీట్



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** "దేశానికి అన్నం పెట్టే అన్నదాతలపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఇబ్బందుల పాలు చేస్తోంది. అబద్ధాలతో గద్దెనెక్కిన రేవంత్ సర్కార్ రైతులను అనాథలను చేయాలని చూస్తోంది" అని బీఆర్ఎస్ నియోజకవర్గ ముఖ్య నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు నివాసంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు రైతాంగ సమస్యలపై, సాగునీటి కొరతపై కాంగ్రెస్ వైఖరిని తీవ్రంగా ఎండగట్టారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నేతలు మాట్లాడుతూ.. ఆనాడు కేసీఆర్ ప్రభుత్వం 2 కోట్ల 30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించి, కల్లాల్లో పోసిన వడ్లను, తడిసిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేసి అన్నదాతకు అండగా నిలిచిందన్నారు. కానీ నేడు కాంగ్రెస్ పాలనలో రైతులు కన్నీరు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇస్తానన్న రైతుబంధు ఏది? అసలు ఇస్తారా ఇవ్వరా? వడ్లకు ఇస్తామన్న రూ. 500 బోనస్ ఏమైందో రేవంత్ సర్కార్ సమాధానం చెప్పాలి. యూరియా బుకింగ్ కోసం యాప్ పెట్టడం కాంగ్రెస్ అసమర్థతకు నిదర్శనం. రైతులు స్మార్ట్ ఫోన్లలో యూరియా ఎలా బుక్ చేసుకుంటారు? యూరియా కోసం చెప్పులు లైన్ లో పెట్టే దరిద్రమైన పాలన మళ్లీ వచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం వల్లే గతంలో రైతులకు పుష్కలంగా సాగునీరు అందింది. ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్ సర్కార్ కేవలం దౌర్భాగ్యపు రాజకీయం చేస్తోంది. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఇక్కడి రైతాంగం పడుతున్న కష్టాలు, కన్నీళ్లు కనిపించడం లేదా అని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు. వానాకాలం పంటలు వేసేందుకు సాగునీరు ఇస్తారా.. ఇవ్వరా.. ఎమ్మెల్యే స్పష్టం చేయాలి. కేంద్రం ప్రకటించే పంటలనే రాష్ట్ర ప్రభుత్వం కొంటుందని చెప్పడం సిగ్గుచేటని నేతలు మండిపడ్డారు. కాంగ్రెస్ పాలన వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఏ ఒక్క రైతైనా సంతోషంగా ఉన్నాడా అని ప్రశ్నించారు. అప్పటి కేసీఆర్ ప్రభుత్వానికి, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారని, అందుకే తెలంగాణ ప్రజలంతా మళ్లీ కేసీఆర్ పాలన రావాలని కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. రైతుల గోసను ప్రభుత్వానికి తెలియజేసేందుకే ఈ ప్రెస్ మీట్ పెట్టామని, రైతులకు అండగా బీఆర్ఎస్ ఎల్లప్పుడూ పోరాడుతుందని భరోసా ఇచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ అరుణా రాఘవరెడ్డి, సీనియర్ నాయకులు మనోహర్ రెడ్డి, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, ప్యాక్స్ చైర్మన్లు జలగం కిషన్ రావు, తిప్పని శ్రీనివాస్, సింగిల్ విండో వైస్ చైర్మన్లు మానుపాటి భూమిరెడ్డి, కాశవేణి మహేష్, సీనియర్ నాయకులు గడ్డం హన్మండ్లు, అజిత్ రావు, రవి కుమార్, మండల అధ్యక్షులు మల్యాల దేవయ్య, గోసుకుల రవి, పట్టణ మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, గోలి మహేష్, మారం కుమార్, సీనియర్ నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పట్టణ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.